సాక్షి
అనంతపురం
సోమవారం । 22 । జనవరి । 2024



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.



నేడు 'స్పందన' రద్దు

తుది ఓటర్ల జాబితా సోమవారం ప్రచురించాల్సి ఉన్నందున కలెక్టరేట్‌లో 'స్పందన'ను రద్దు చేసినట్లు డీఆర్వో గాయత్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు.

గరిష్టం/కనిష్టం
34.8°/ 17.2°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

కుల గణన సర్వే పక్కాగా చేపట్టండి



సర్వేపై ఆరా తీస్తున్న జెడ్పీ సీఈఓ నిదియాదేవి

కూడేరు: కుల గణన సర్వేను తప్పులు లేకుండా పక్కాగా చేపట్టాలని జెడ్పీ సీఈఓ నిదియాదేవి ఆదేశించారు. ఆదివారం కూడేరులోని ఎస్సీ కాలనీలో జరుగుతున్న కుల గణన సర్వేను ఆమె తనిఖీ చేశారు. సర్వే ఏవిధంగా చేస్తున్నారని ప్రజలతోను, సిబ్బందితోను ఆరా తీశారు. 1930లో కుల గణన సర్వే జరిగిందని, మళ్లీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేపడుతోందన్నారు. సర్వేపై నిర్లక్ష్యం వహించకుండా తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మూడో రోజుకు దాదాపు 40 శాతం సర్వే పూర్తి కావడంపై సీఈఓ సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగభూషణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రఘు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు, రేపు ఏహెచ్‌ఏ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం అగ్రికల్చర్: అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ (ఏహెచ్‌ఏ) పోస్టుల భర్తీలో భాగంగా ఆన్‌లైన్ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు సోమవారం, మంగళవారం సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రమణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 473 పోస్టులకు గాను 919 మంది ఆన్‌లైన్ పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. మెరిట్, రోస్టర్ ప్రకారం మొదటి విడతలో 206 మంది అభ్యర్థులు అర్హత సాధించారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనకు నాలుగు బృందాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. సోమవారం ఉదయం 50 మంది, మధ్యాహ్నం 50 మందికి సర్టిఫికెట్ల పరిశీలన కోసం రావాల్సిందిగా సమాచారం ఇచ్చామన్నారు. మంగళవారం మిగతా వారి సర్టిఫికెట్లు పరిశీలనకు కాల్ లెటర్లు పంపామని పేర్కొన్నారు. 25వ తేదీ నాటికి అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



సీఎం సభకు పంపే ఆర్టీసీ బస్సు కండీషన్ పరిశీలిస్తున్న జోనల్ చైర్‌పర్సన్ మంజుల

ఉరవకొండ: సీఎం పర్యటన సందర్భంగా ఈ నెల 23న గ్రామీణ ప్రాంతాల నుంచి ఉరవకొండకు వచ్చేందుకు అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల తెలిపారు. అనంతపురం రీజియన్ పరిధిలోని డిపోమేనేజర్లతో ఆదివారం ఆమె ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఉరవకొండలో సీఎం వైఎస్ జగన్ హాజరయ్యే 'వైఎస్సార్ ఆసరా' సభ కోసం కండీషన్ బస్సులను పంపించాలని డీఎంలను ఆదేశించామన్నారు. మహిళా సాధికారత కోసం సీఎం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. మహిళలు పెద్ద సంఖ్యలో సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఎం సభకు పంపే బస్సుల కండీషన్‌ను స్థానిక డీఎం బాలాజీతో కలిసి చైర్‌పర్సన్ పరిశీలించారు.

రైతుల్లో చైతన్యానికి కృషి చేయడం అభినందనీయం



నీరజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం: చిరుధాన్యాల సాగుపై రైతులను చైతన్య పరిచేందుకు మిషన్ మిల్లెట్ పేరుతో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ సైకిల్ యాత్ర చేపట్టిన నీరజ్‌కుమార్ ప్రజాపతి చొరవ అభినందనీయమని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి అన్నారు. సైకిల్ యాత్రికుడు నీరజ్‌కుమార్ ఆదివారం రెడ్డిపల్లి కేవీకేను సందర్శించారు. కేవీకేలో పంటల సాగు, పరిశోధనలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ చిరుధాన్యాల ఆవశ్యకతపై నీరజ్‌కుమార్ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుధారాణి, సస్య ఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త చందన, రైతులు పాల్గొన్నారు.

కలహాలు.. కొట్లాటలు!

- తెలుగుదేశం పార్టీలో ఎవరికీ సత్సంబంధాలు లేవు
- పరిటాల, జేసీ కుటుంబాలకు మద్దతు కరువు
- చిల్లర కొట్లాటలను తలపించిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం
- జిల్లా అధ్యక్షుల మాట ద్వితీయ శ్రేణి నాయకులూ వినడం లేదు
- అధిష్టానానికి తలనొప్పిగా మారిన కొట్లాటలు
- అందుకే టికెట్ల వెల్లడిలో జాప్యమంటున్న నేతలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: తెలుగుదేశం పార్టీలో వర్గపోరు తారస్థాయికి చేరింది. నాయకుల మధ్య సఖ్యత చెడి ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 నియోజకవర్గాలున్నాయి. ఏ నాయకుడికీ మరొక నియోజకవర్గ నాయకుడితో సరైన సంబంధాలు లేవు. ఎన్నికల్లో ఒకరినొకరు ఓడించాలనే ధ్యేయంతో పనిచేస్తున్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు టీడీపీ అధ్యక్షులను నియమించింది. కానీ ఇక్కడ జిల్లా అధ్యక్షుల మాట కిందిస్థాయి నాయకులు వినే పరిస్థితి లేదు.

పరిటాల వర్గమంటేనే భగ్గుమంటున్నారు

పరిటాల రవి బతికున్నపుడు టీడీపీలో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకునేవారు. ఆయన మరణానంతరం పరిటాల కుటుంబమంటేనే కత్తులు దూస్తున్న పరిస్థితి. రాప్తాడు పక్కనే ఉన్న ఉరవకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు పరిటాల కుటుంబానికి సత్సంబంధాలు లేవు. పార్టీ కార్యక్రమాల్లోనూ కలిసి పాల్గొనే పరిస్థితులు చాలా తక్కువ. ఇక ధర్మవరం నుంచి 2014లో టీడీపీ తరఫున గెలుపొందిన వరదాపురం సూరి.. 2019లో ఓడిపోయారు. తర్వాత బీజేపీలో చేరి ఇప్పుడు పరిటాల శ్రీరామ్‌తో కయ్యానికి కాలు దువ్వుతూనే ఉన్నారు. ఇద్దరూ ఒకే ఊర్లో ఉంటే రోజూ ఉద్రిక్త పరిస్థితులే.

జేసీ అనుచరులతో ఎవరికీ సంబంధాలు లేవు

పరిటాల తర్వాత జిల్లాలో ప్రధాన గ్రూపు జేసీ బ్రదర్స్‌ది. ఈడీ కేసుల్లో పీకల్లోతు కూరుకుపోయిన జేసీ ప్రభాకర్‌రెడ్డిని ఇప్పుడు జిల్లాలో పలకరించే దిక్కులేదు. పార్టీపరంగా కానీ, వ్యక్తిగతంగా కానీ ఎవరూ ఆయన దగ్గరకు రాని పరిస్థితి. జిల్లాలో ఏ నాయకుడితోనూ సత్సంబంధాలు లేవు. విధిలేని పరిస్థితుల్లోనే ఆయన కుమారుడికి టీడీపీ అధిష్టానం టికెట్ ఇస్తున్నట్లు తెలిసింది.

కాలవ మాటకు విలువేది?

టీడీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కాలవ శ్రీనివాసులు మాటకు విలువ ఇచ్చే నాయకులు వెతికినా కనిపించరు. పైగా ఆయనంటే ప్రతి నియోజకవర్గంలోనూ ప్రధాన నాయకులు కత్తులు దూస్తున్నారు. అంతటా ప్రత్యేక గ్రూపులు పెట్టి పార్టీని అధమ స్థాయికి తీసుకెళ్లారని కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుంతకల్లు తదితర నియోజకవర్గాల నాయకులు వాపోతున్నారు. అందుకే కాలవ శ్రీనివాసులుకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకుండా ఎంపీగా దించాలని అధిష్టానం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

బీకే వేదన అరణ్య రోదన

టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న బీకే పార్థసారథి వేదన అరణ్య రోదనగానే ఉంది. తనకు టికెట్ లేదన్న లీకులు ఆయన్ను కలవరపెడుతున్నాయి. సవితమ్మకూ ఈయనకూ గత కొన్నేళ్లుగా ఉప్పూ నిప్పుగా ఉంది. ఈసారి సవితమ్మకు టికెట్ ఇస్తూ తనను ఎంపీగా పంపిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. కానీ ఎమ్మెల్యేగానే పోటీచేస్తా అని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా బీకేను పార్టీ లెక్కలోకి తీసుకోవడం లేదు. దీంతో పార్టీ అధ్యక్షుడిగా తన మాట ఎవరూ వినడం లేదని ఆయన లోలోపల కుమిలిపోతున్నారు.

వర్ధంతి..జయంతులకు కొట్లాటే

ఇటీవల ఎన్టీఆర్ వర్ధంతి జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రతి నియోజకవర్గంలోనూ కొట్లాటలే. పూలదండలు వేసే కార్యక్రమం చిల్లర కొట్లాటలను తలపించాయి. కళ్యాణదుర్గం నుంచి కదిరి వరకూ వర్గాలు బాహాబాహీగా పోరులో పాల్గొన్నవే. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ పరిస్థితి చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. వర్గపోరును నియంత్రించలేకపోతున్నారు. అందుకే టికెట్ల ప్రకటనలో తీవ్ర జాప్యం చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు చెబుతున్నారు.

పేదల పక్షపాతి జగన్

- 'వైఎస్సార్ ఆసరా'తో అక్కచెల్లెమ్మలను ఆదుకున్నారు
- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల పక్షపాతి అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. పాదయాత్ర, మేనిఫెస్టో హామీలను తూచా తప్పకుండా అమలు చేసిన ఏకైక నేత అని కొనియాడారు. ఈ నెల 23న సీఎం పర్యటనను పురస్కరించుకుని ఉరవకొండలో అనంతపురం బైపాస్ వద్ద పెట్రోలు బంకు సమీపాన జరుగుతున్న సభ ఏర్పాట్లను ఆదివారం పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ ఆసరా నాల్గో విడత కింద డ్వాక్రా సంఘాలకు సొమ్ము విడుదల చేసే కార్యక్రమం ఉరవకొండ వేదికగా నిర్వహించనుండటం సంతోషంగా ఉందన్నారు. సీఎం రాక కోసం ఈ ప్రాంత ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా పథకాన్ని విజయవంతంగా అమలు చేసి మహిళను ఆదుకుంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఉరవకొండ నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి జరిగిందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. కార్యక్రమంలో కూడేరు, ఉరవకొండ ఎంపీపీలు నారాయణరెడ్డి, నరసింహులు, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్ పాల్గొన్నారు.

పొలాలకు రాచబాట

గుమ్మఘట్ట మండలం అడిగుప్ప నుంచి గొల్లపల్లి పొలాలను అనుసంధానం చేసే రహదారి దారుణంగా ఉండేది. పంట ఉత్పత్తులు తరలించేందుకు రైతులు ఎడ్లబండ్లను ఎక్కువగా వినియోగిస్తారు. గతుకుల ప్రయాణం సాగించలేక నానా కష్టాలు అనుభవించారు. ఇప్పుడు రూ.9 లక్షల వ్యయంతో 4 కిలోమీటర్ల దారి నాణ్యతగా నిర్మించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ నిధులతో 1,481 మట్టి రోడ్ల అభివృద్ధి జరుగుతోంది.



రైతులకు ఊరట

- 'ఉపాధి' పనుల్లో పొలం దారులకు అధిక ప్రాధాన్యత
- రూ.68.35 కోట్లతో 1,481 మట్టి రోడ్లు

రాయదుర్గం: వ్యవసాయ రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల అవసరాల దృష్ట్యా పొలాలకు వెళ్లే దారుల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. టీడీపీ హయాంలో 'నీరు-చెట్టు' పథకం ద్వారా ఉపాధి నిధులను అడ్డగోలుగా దోచేస్తే.. సీఎం జగన్ మాత్రం కూలీలు, రైతుల సంక్షేమానికి ప్రతి పైసా వినియోగిస్తూ ముందుకు పోతున్నారు. కొన్నేళ్ల కిందటే రోడ్లు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. గత ప్రభుత్వం మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు పొలాలకు వెళ్లాలన్నా, వ్యవసాయ పరికరాలు తీసుకెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఈ కష్టాల నుంచి గట్టెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

1,481 పనులు మంజూరు

జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉన్నాయి. 2021-22 నుంచి 2022-23 బడ్జెట్‌లో 1,481 మట్టి రోడ్లు అభివృద్ధి చేసేందుకు రూ.68.35 కోట్ల నిధులు కేటాయించారు. వీటిలో ఇప్పటికే 52 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన చోట చురుగ్గా సాగుతున్నాయి. సింహభాగం పొలం బాటలు ఉండగా.. అవసరమైన చోట్ల శ్మశానాలకు వెళ్లే దారులను సైతం అభివృద్ధి చేస్తున్నారు.

రైతులకు ప్రయోజనం



అడిగుప్ప నుంచి గొల్లపల్లి వెళ్లే రహదారి పొలాలను అనుసంధానం చేస్తోంది. ఈ దారి అభివృద్ధి కోసం రైతులు చాలాకాలంగా ఎదురుచూశారు. ప్రస్తుతం రూ.9 లక్షల ఉపాధి నిధుల ద్వారా రోడ్డు నిర్మాణం చురుగ్గా సాగుతోంది. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– బోయ రామరాజు, అడిగుప్ప, గుమ్మఘట్ట (మం)

రైతు ప్రయోజనాలకు పెద్దపీట



ఉపాధి పనుల్లో రైతుల స్వప్రయోజనానికి పెద్దపీట వేశాం. పొలాలకు వెళ్లే దారులతో పాటు అక్కడక్కడా శ్మశానాలకు అవసరమైన దారుల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. జిల్లాలో 1,481 రోడ్లు అభివృద్ధి పరుస్తున్నాం.

– వేణుగోపాల్‌రెడ్డి, డ్వామా పీడీ

రేపు ఉరవకొండలో సీఎం పర్యటన



అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23వ తేదీన ఉరవకొండ పర్యటనకు విచ్చేయనున్నారు. 'వైఎస్సార్ ఆసరా' రాష్ట్రస్థాయి కార్యక్రమంలో పాల్గొని కంప్యూటర్ బటన్ నొక్కి డ్వాక్రా సంఘాల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేయనున్నారు.

సీఎం పర్యటన ఇలా...

- 23వ తేదీ ఉదయం 9 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి విమానంలో బయల్దేరి ఉదయం 9.45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు.
- ఉదయం 10 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.30కు ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి చేరుకుంటారు.
- హెలిప్యాడ్ వద్ద ఉదయం 10.30 నుంచి 10.40 గంటల వరకు ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు.
- 10.40 గంటలకు హెలిప్యాడ్ నుంచి బయల్దేరి 10.50 గంటలకు బహిరంగ సభావేదిక వద్దకు చేరుకుంటారు.
- 10.55 నుంచి మధ్యాహ్నం 12.35 గంటల వరకు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడతారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. ఆ తరువాత వైఎస్సార్ ఆసరా నాల్గో విడత కింద కంప్యూటర్ బటన్ నొక్కి డ్వాక్రా సంఘాల ఖాతాల్లో నగదు జమ చేస్తారు. ఆ తర్వాత మెగా చెక్ విడుదల చేస్తారు.
- మధ్యాహ్నం 12.35 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి హెలిప్యాడ్ వద్దకు 12.45 గంటలకు చేరుకుంటారు. 1.45 గంటల వరకు స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో మాట్లాడతారు.
- మధ్యాహ్నం 1.50 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి మధ్యాహ్నం 2.20కు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30కు అక్కడి నుంచి విమానంలో గన్నవరం వెళతారు.



పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమి, మాజీ ఎమ్మెల్యే విశ్వ

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

ఉరవకొండ: వైఎస్సార్ ఆసరా నాల్గో విడత సొమ్మును విడుదల చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉరవకొండకు వస్తున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. పట్టణంలోని అనంతపురం రోడ్డు వైపున్న భారత్ పెట్రోల్ బంక్ వద్ద నిర్వహించే సభకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్, జేసీ కేతన్‌గార్గ్, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్‌రెడ్డితో కలసి పరిశీలించారు. జూనియర్ కళాశాల వద్ద హెలిప్యాడ్ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, అడిషనల్ ఎస్పీలు విజయ్‌భాస్కర్‌రెడ్డి, హనుమంతు, ఆర్డీఓలు రాణీ సుస్మిత, వి.శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ శ్రీధర్ మూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనంతలో భారీ అగ్ని ప్రమాదం



షాపులో దగ్ధమవుతున్న గుజిరీ సామగ్రి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న మేయర్ వసీం



గుజిరీ షాపులో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న మంటలు (ఇన్‌సెట్‌లో) షాపు యజమాని లలిత

- గుజిరీ సామగ్రికి నిప్పు
- కమ్మేసిన దట్టమైన పొగ
- భయంతో పరుగులు తీసిన స్థానికులు

అనంతపురం క్రైం: అనంతపురం నగరంలో ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. స్థానిక గుత్తిరోడ్డులోని గుజిరీ షాపులో నిప్పంటుకుంది. పాత టైర్లు ఎక్కువగా నిల్వ ఉండటం, ప్రమాదాన్ని గుర్తించడంలో ఆలస్యం కావడంతో అగ్ని కీలలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. గుత్తిరోడ్డుతో పాటు ఎన్టీఆర్ మార్గ్, మార్కెట్ యార్డు పరిసర ప్రాంతాలను దట్టమైన పొగ కమ్మేసింది. స్థానికులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. అగ్నిమాపక, పోలీసు, నగర పాలక సంస్థ సిబ్బంది సంయుక్తంగా మంటలు ఆర్పేందుకు తీవ్రంగా కృషి చేశారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు మంటలు చెలరేగగా.. పూర్తిస్థాయిలో అదుపులోకి తెచ్చేందుకు మధ్యాహ్నం ఒంటి గంట అయ్యింది. అగ్ని ప్రమాదంలో రూ.20 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు గుజిరీ షాపు యజమాని లలిత కన్నీరు మున్నీరయ్యారు. ఎవరో ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టి ఉండొచ్చని ఆమె అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తరలించాల్సిన సమయంలో తగులబడిపోయాయి!

గుజిరీ షాపు నిర్వాహకుడు రాముడు నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో భార్య లలిత షాపు నిర్వహిస్తోంది. ఇదే షాపులో ఏడాదిన్నర క్రితం జరిగిన ఓ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. షాపు వాహన డ్రైవరుగా పని చేస్తున్న వ్యక్తి మూడు రోజుల క్రితం వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో గుజిరీ సామగ్రిని హైదరాబాదుకు తరలించే వారు లేక స్టాకు నిల్వ ఉంచాల్సి వచ్చింది. సొంత వాహనం ఉన్నప్పటికీ డ్రైవరు లేకపోవడంతో లలిత చివరకు మూడు ఐచర్ వాహనాలను బాడుగకు తెప్పించి శనివారం రాత్రి పాత టైర్లను లోడ్ చేయించారు. ఉదయాన్నే వాటిని పంపాల్సి ఉండడంతో వాహనాలను బయట పెట్టించారు. అయితే..లోపల ఇంకా నిల్వ ఉన్న పాత టైర్లు, ఇతర గుజిరీ సామగ్రి మంటల్లో పూర్తిగా కాలిపోయింది.

శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది..

మంటలను అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. నాలుగు ఫైరింజన్లను రంగంలోకి దింపారు. పదుల కొద్దీ ట్యాంకర్ల నీటిని నాలుగు వైపులా వదిలి మంటలార్పాల్సి వచ్చింది. అదృష్టవశాత్తు ప్రాణనష్టమేమీ జరగలేదు. మంటల తీవ్రతకు గుజిరీ షాపునకు ఆనుకుని ఉన్న ఓ భవనం పెచ్చులూడింది. పక్కనే ఉన్న ఫర్నీచర్ గోదాముకు మంటలు తాకడంతో షెడ్డు కూడా పాక్షికంగా దెబ్బతింది. దట్టమైన పొగ కమ్ముకోవడంతో శ్వాసకోస, ఇతర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడ్డారు. కొంతమంది వృద్ధులకు ఊపిరి ఆడకపోవడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ప్రమాదం గురించి తెలుసుకున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ నాలుగు స్టేషన్ల పోలీసులను రంగంలోకి దింపారు. ఓ వైపు అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను ఆర్పుతుండగా... మరోవైపు పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించడంతో పాటు పరిసర ప్రాంతాల్లోని గోదాములను ఖాళీ చేయించారు. నగర పాలక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ మేఘ స్వరూప్, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. బాధితురాలు లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా... గుజిరీలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నగర శివారు ప్రాంతాలకు తరలించాలని స్థానికులు పోలీసులను కోరారు.

క్లుప్తంగా

'పీఎం రాష్ట్రీయ పురస్కార్'కు సూర్యప్రకాష్ ఎంపిక

- నేడు రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం



కిలీ మంజారో పర్వతంపై సూర్యప్రకాష్ (ఫైల్)

పరిగి: మండలంలోని ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి విద్యార్థి సూర్యప్రకాష్ ప్రధానమంత్రి రాష్ట్రీయ పురస్కార్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపారు. సోమవారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటాడని పేర్కొన్నారు. పాఠశాలలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థి సూర్యప్రకాష్ గతేడాది ఆఫ్రికా ఖండంలోని కిలిమంజారో పర్వతం, లడక్ ప్రాంతంలోని దక్షిణ పుల్లు పర్వతం అధిరోహించినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే ప్రధానమంత్రి రాష్ట్రీయ పురస్కార్ అవార్డుకు ఎంపిక చేశారన్నారు. దీంతో పాటు నెహ్రూ యువకేంద్రం వారు 2024 సంవత్సరానికి గానూ బాలల అవార్డుకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సూర్యప్రకాష్ కుటుంబానికి రూ. 6 లక్షలు నగదు బహుమానం అందించిందన్నారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంట్లో చోరీ

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని కొత్తపల్లి రామదాసు అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. కుటుంబంతో కలసి రామదాసు నాలుగు రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లాడు. గుర్తు తెలియని దుండగులు తలుపులు పగలు గొట్టి బీరువాలో ఉన్న రూ.3.50 లక్షలు దొంగిలించారు. బెంగళూరు నుంచి ఇంటికి వారు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

యాడికి: పేకాట ఆడుతున్న 14 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్ఐ గురుప్రసాదరెడ్డి వెల్లడించారు. కొంత కాలంగా యాడికి శివారులో పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కోన మార్గంలోని కంప చెట్లలో ఐదుగురు పట్టుబడగా వారి నుంచి రూ.6,150, రాఘవేంద్ర కాలనీలో నలుగురిని అరెస్ట్ చేసి, రూ.6,050 స్వాధీనం చేసుకున్నారు. అలాగే చౌడేశ్వరి కల్యాణమంటపం వద్ద ఐదుగురు పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.11,150 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'క్యాంపస్'లో కోర్సుల కోత!

- బీటెక్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అమలుకు నిరాకరణ
- ఎంటెక్‌లో బ్రిడ్జి ఇంజినీరింగ్ కోర్సుకు మాత్రమే అనుమతి
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎంటెక్‌లో కేవలం పది కోర్సులే



అనంతపురం: మారుతున్న కాలాని అనుగుణంగా పరిశ్రమల అవసరాలకు తగిన మానవ వనరులను అందించే దిశగా ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు సరికొత్త కోర్సులు అమలు చేస్తూ విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. అయితే 77 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన జేఎన్‌టీయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో మాత్రం ఇందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. ప్రతిభావంతులైన విద్యార్థులు చదువుకునే క్యాంపస్ కళాశాలలో కొత్త కోర్సుల అమలుకు నిరాకరణ ఎదురవడమే ఇందుకు కారణం.

బీటెక్‌లో ఏఐ అండ్ ఎంఎల్ కోర్సు లేనట్లే..

జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇప్పటి వరకూ మెకానికల్, సివిల్, కంప్యూటర్ సైన్సెస్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ కోర్సులు మాత్రమే ఉన్నాయి. వీటికి తోడు ఈ విద్యా సంవత్సరం బీటెక్‌లో కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ కోర్సును ప్రవేశపెట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించి ఏఐసీటీఈ నుంచి అనుమతి సైతం దక్కించుకున్నారు. అయితే గత పాలకమండలి సమావేశంలో కొత్త కోర్సుల అనుమతి అంశంపై చర్చ సాగినప్పుడు వాటి అమలుకు మండలి సభ్యులు ఆసక్తి కనబరచలేదు. దీంతో గతంలో ఉండే ఆరు బ్రాంచ్‌ల్లోనే ఇంజినీరింగ్ అడ్మిషన్లు చేపట్టనున్నారు.

ఎంటెక్‌లోనూ కోతే..

జేఎన్‌టీయూ (ఏ)ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్ కోర్సులో ఇప్పటి వరకూ 24 బ్రాంచ్‌లు ఉన్నాయి. 2024–25 విద్యాసంవత్సరానికి వీటిని 10 బ్రాంచ్‌లకే పరిమితం చేయనున్నారు. ప్రస్తుతం స్ట్రక్చరల్ ఇంజినీరింగ్, పవర్ సిస్టమ్స్, పవర్ అండ్ ఇండస్ట్రీయల్ డ్రైవ్, రెఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండీషనర్, డిజిటల్, ఎలక్ట్రికల్ అండ్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్సెస్, నానో టెక్నాలజీ, వీఎల్ఎస్ఐ అండ్ డిజైన్ కోర్సులతో పాటు తాజాగా సివిల్ ఇంజినీరింగ్‌లో బ్రిడ్జ్ టెక్నాలజీ (బ్రిడ్జి అండ్ టన్నెల్) బ్రాంచ్‌ను అదనంగా ప్రవేశపెడుతున్నారు. కేవలం ఈ పది కోర్సులతోనే క్యాంపస్ కళాశాల కాలం నెట్టుకు రావాల్సి ఉంది. మిగిలిన 14 బ్రాంచ్‌లకు కోత పెట్టారు.

కోర్సుల అమలుతో మెరుగైన ఉపాధి అవకాశాలు

అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి దక్కించుకున్న జేఎన్‌టీయూ(ఏ)ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేయాలనే ఆకాంక్ష ఎంతో మంది విద్యార్థులకు ఉంది. ఏపీ ఈఏపీసెట్‌లో(గతంలో ఎంసెట్) గణనీయమైన ర్యాంకులు దక్కిన వారికే జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాలలో సీటు దక్కే పరిస్థితి ఉంది. ఈ కళాశాలలో ఇంజినీరింగ్ అడ్మిషన్లకు భారీగా డిమాండ్ ఉంది. ఈ క్రమంలో ఈఏపీసెట్‌లో అత్యుత్తమ ర్యాంకు వచ్చే విద్యార్థులు మొదట ఆప్షన్ ఇస్తుండడంతో అత్యుత్తమ ర్యాంకర్లకే సీట్లు వస్తున్నాయి. ఏటా క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా పేరెన్నిక గల బహుళజాతి సంస్థల్లో 300 మందికి పైగా విద్యార్థులు కొలువులు దక్కించుకుంటున్నారు. దీంతో ఈ కళాశాలలో సీటు హాటుకేక్‌గా మారింది. ఈ క్రమంలో అదనంగా బీటెక్‌లో బ్రాంచ్ ఏర్పడితే గొప్ప సదావకాశంగా భావిస్తారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్, కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో మొత్తం 360 ఇంజినీరింగ్ సీట్లు ఉన్నాయి. తాజాగా కొత్త బ్రాంచ్ ఏర్పడితో మరో 60 ఇంజినీరింగ్ సీట్లు వస్తాయి. ప్రస్తుత మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ కళాశాలలో ప్రవేశపెడితే అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా విద్యార్థులకు గొప్ప అవకాశం దక్కినట్లే. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూ (ఏ) ఉన్నతాధికారులు పునరాలోచించి బీటెక్‌లో అదనపు బ్రాంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

పరిశీలిస్తాం



జేఎన్‌టీయూ (ఏ)క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ కోర్సు ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదన ఉంది. దీనిని పరిశీలిస్తాం. 2023–24 విద్యా సంవత్సరంలో ఎంటెక్‌లో బ్రిడ్జ్ టెక్నాలజీ కోర్సును ప్రవేశపెట్టాం. కొత్త కోర్సులకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదన రాలేదు. ఎంటెక్ కోర్సులు తగ్గించాం.

– ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్, జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్ కళాశాల

గాలిమరపై నుంచి పడి ఇంజినీర్ మృతి



మృతుడు కిరణ్

వజ్రకరూరు: గాలిమరపైకి ఎక్కి మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి ఓ ఇంజినీర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... వజ్రకరూరు మండలంలోని సుజలాన్‌కు చెందిన గాలిమరల కంపెనీలో కర్ణాటకలోని విజయనగరం జిల్లా హోస్పేటకు చెందిన ఎస్.కిరణ్ (37) 11నెలలుగా ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం గడేహోతూరు పరిసర ప్రాంతాల్లో ఉన్న ఓ గాలిమరపైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా అదుపు తప్పి కిందపడ్డాడు. బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి..

తన భర్త మృతికి సుజలాన్ కంపెనీ అధికారులు, యాజమాన్యమే కారణమంటూ ఈ సందర్భంగా పోలీసులకు మృతుడు కిరణ్ భార్య స్వాతి ఫిర్యాదు చేసింది. నిబంధనల మేరకు గాలిమరలు పనిచేయకపోతే వాటి మరమ్మతుకు లిఖిత పూర్వకంగా ఆదేశాలు జారీ చేయాల్సి ఉందని పేర్కొంది. అయితే ఇందుకు విరుద్ధంగా వర్క్ పర్మిట్ ఇవ్వకుండా కేవలం ఫోన్ ద్వారా మౌఖిక ఆదేశాలు జారీ చేసే వారని తెలిపింది.

ఖాకీ వలలో నిరుద్యోగ యువతి విలవిల

- ప్రేమ, పెళ్లి పేరుతో వంచన

అనంతపురం క్రైం: పోలీసు లైబ్రరీలో చదువుకునేందుకు వచ్చిన ఓ విద్యార్థినిని మాయమాటలతో లోబర్చుకున్న ఆర్ఎస్ఐ ఉదంతం ఆదివారం వెలుగుచూసింది. అనంతపురం నాల్గో పట్టణ పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని మారుతీనగర్‌కు చెందిన ఓ యువతి ఉద్యోగాల అన్వేషణలో భాగంగా పోలీసు లైబ్రరీలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటోంది. ఈ క్రమంలో అక్కడున్న ఆర్ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. మాయమాటలతో లోబర్చుకుని పెళ్లి పేరుతో శారీరక అవసరాలు తీర్చుకున్నాడు. ఈ క్రమంలో ఆమె పెళ్లి ఊసెత్తగానే మొహం చాటేశాడు. పలుమార్లు ఆమె ప్రాధేయపడినా వినలేదు. చివరకు విషయాన్ని తన తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. పంచాయితీ నిర్వహించి తన గుట్టును రట్టు చేయడంతో ఆగ్రహించిన ఆర్ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ బాధితురాలిని హతమారుస్తానంటూ బెదిరింపులకు దిగాడు. ఇందుకు సంబంధించిన ఫోన్ సంభాషణ దాచుకున్న ఆమె ఆదివారం నేరుగా నాల్గో పట్టణ పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సత్యసాయి ఆశయాలకు అనుగుణంగా వైద్య సేవలు





ప్రసంగిస్తున్న సిమ్స్ వైట్‌ఫీల్డ్ డైరెక్టర్ డాక్టర్ సుందరేష్‌ధబీర్, శతమానంభవతి నాటికలోని ఓ సన్నివేశం

- సిమ్స్ వైట్‌ఫీల్డ్ డైరెక్టర్ డాక్టర్ సుందరేష్ ధబీర్

ప్రశాంతి నిలయం: సత్యసాయి ఆశయాలకు అనుగుణంగా నాణ్యమైన వైద్య చికిత్సలు అందజేస్తున్నట్లు బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లోని సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) డైరెక్టర్ డాక్టర్ సుందరేష్ ధబీర్ అన్నారు. వైట్‌ఫీల్డ్ సిమ్స్ 23వ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సుందరేష్‌ధబీర్ మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో వైద్యం వ్యాపారమయమైనా... సత్యసాయి వైద్య సంస్థల్లో మాత్రం రోగులకు ఉచితంగానే నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. రోగుల పట్ల సిబ్బంది అంకిత భావంతో పని చేస్తూ ప్రేమతో వారికి వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. అనంతరం శతమానం భవతి పేరుతో సిమ్స్ సిబ్బంది ప్రదర్శించిన సందేశాత్మక నాటిక మానవీయ విలువలకు అద్దం పట్టింది. వాతావరణ కాలుష్యం, అనర్థపు ఆహారపు అలవాట్లతో ప్రజలు పడుతున్న బాధలు, వాటికి పరిష్కారాలను చూపుతూ ఆలోచనాత్మకంగా సాగింది.

బంగారు కమ్మలు, నగదు అపహరణ

పెనుకొండ: ప్రయాణికురాలి బ్యాగ్‌లో నుంచి బంగారు కమ్మలు, నగదు అపహరించుకెళ్లిన ఘటన పెనుకొండలో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని కోనాపురం గ్రామానికి చెందిన ఆశ... తన కుమారులతో కలసి శనివారం సాయంత్రం పావగడ నుంచి పెనుకొండకు బస్సులో వచ్చి అంబేడ్కర్ సర్కిల్‌లో కూడలిలో దిగింది. ఆ సమయంలో కుమారులు కాయగూరలు కొనుగోలు చేసేందుకు వెళ్లారు. ఎంతసేపటికీ వారు రాకపోవడంతో జనసంచారమైన ఆ ప్రాంతంలోనే బ్యాగులను వదిలి వెళ్లి, కుమారులను పిలుచుకొచ్చి స్వగ్రామానికి చేరుకుంది. ఇంటికి చేరుకున్న తర్వాత బ్యాగ్‌లను పరిశీలిస్తే అందులో ఉంచిన బంగారు కమ్మలు, రూ.5 వేలు నగదు కనిపించలేదు. కంగారు పడిన ఆమె ఆదివారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి పెనుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

HOME TUITIONS

■ Inter, Diploma, 10th Maths. General & Home Tuitions are Available. Timings are your Choice. Cell : 9505277169, 7989646177. [A-1550]

ADMISSIONS

■ 2nd కౌన్సిలింగ్‌లో B.Sc. (MLT), BTP (ఫిజియోథెరపీ)లో సీట్స్ రానివారికి 3rd కౌన్సిలింగ్‌లో Govt. సీట్స్ కోసం సంప్ర : G. MURALI, 9030661651, అనంతపురం. [A-3005]

DISTANCE EDUCATION

■ ఆంధ్ర యూనివర్సిటీ & ANU అడ్మిషన్స్ జరుగుచున్నవి B.A, B.Com, B.Sc, (TM/EM) (All Groups), M.A, M.Com, M.Sc (All Subjects) M.B.A, M.S.W, B.Li.Sc, M.Li.Sc. డా॥ బి. మధుసూధన. ఫోన్ : 83282 79245. [V-6372]

REAL ESTATE

FOR RENT

■ Most suitable commercial space for Clinic, Lab, Study Hall, Private Offices etc for Rent. Near Divyasree Hospitals, Adimurthy Nagar, ATP. Ph: 8639325680. [A-7396]

గోడౌన్ బాడుగకు

■ అనంతపురము టౌన్, నాయక్ నగర్ రైల్వే గేట్ దగ్గర 1800 చ॥అ॥ గల గోడౌన్ అన్ని సదుపాయాలతో బాడుగకు కలదు. సెల్ : 9849004785, 8919265534. [A-784531]

FLAT FOR SALE

■ Flat No: 302, SLV Concorde, Third cross left, Seven hills colony, Vidyut Nagar, Anantapur- 515001. 1050 Sq.ft area, well ventilated amazing balcony view with good infrastructure and Amenities. Ready to occupation. Contact Number: 9908790887. [A-7397]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V-6370]

WANTED

■ ప్రముఖ కార్పొరేట్ ప్రై.లి. కంపెనీలో వర్క్ చేయుటకు ఫీల్డ్ వర్కర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, FRANCHISE కొరకు సంప్రదించండి : 90009 77523. [A-3004]

■ అనంతపురములో ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ నందు జాబ్ చేయడానికి Male / Females కావలెను. సంప్ర: జి. మురళీ, సెల్ : 90806 61651, అనంతపురము. [A-3003]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024 / 9640400073 [HA-1109]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1167505]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233754]

■ మీరు ఉన్న చోటు నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో అధిక ఆదాయం సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్ టైం) 100% ఎటువంటి ఫీజులు ఉండవు. సంప్ర : 78812 69807 [V-797160]

■ తాడిపత్రి, యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, మండలంలో ప్రతి గ్రామంలో ఒకరు రియల్ ఎస్టేట్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతము + కమీషన్ + ఇన్సెంటివ్ + Daily Allowance ఇవ్వబడును. (Conditions Apply) Contact 9490763299, 7993243555. [L-806335]

■ మా హోమ్ కొరకు స్త్రీలు కేర్ టేకర్స్, జీ : 10-15 వేలు & సెక్యూరిటీ గార్డ్స్, వాలంటీర్లు - 20 మంది. జీ : 8 వేలు + వసతి + భోజనం ఫ్రీ. ATP. సెల్ : 9010387993 [A-784533]

■ అనంతపురం నగరంలోని ప్రముఖ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేయుటకు ఈసీఈ / మెకానికల్ లో బీటెక్ / ఎంటెక్ పూర్తీ చేసినవారు, ట్యూటర్‌గా పనిచేయుటకు బీఎస్సీ / ఎమ్మెస్సీ పూర్తీ చేసినవారు & కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేయుటకు బీకాం కంప్యూటర్ పూర్తీ చేసి + టైపింగ్ + ఎమ్మెస్ ఆఫీస్ బాగా వచ్చినవారు కావలెను. సెల్ : 8886621125 / 26 / 28. [A-1548]

■ నిరుద్యోగ యువతి యువకులకు తేజ ప్లేస్మెంట్ వారి ఆధ్వర్యంలో జాబ్ ట్రైనింగ్, కంప్యూటర్ ట్రైనింగ్ + స్కిల్స్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఇస్తూ మీ విద్యార్హతకు తగిన జాబ్స్ అనంతపురం, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, తిరుపతి నందు జాబ్ చూపించబడును. బ్యాచ్ ప్రారంభం తేది: 24-01-2024, సెల్:8441977101. [A-1551]

■ Paytm కంపెనీలో పనిచేయుటకు ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు (ఆన్‌రోల్) కావలెను. అర్హత : 10th, ఇంటర్, డిగ్రీ. జీతం + ఇన్సెంటివ్స్ = Rs. 30,000. # అనంతపురం : 9441945743, తాడిపత్రి: 9642735547, కళ్యాణదుర్గం+రాయదుర్గం : 9959090442, హిందూపురం + కదిరి: 9866419866, గుంతకల్ + గుత్తి : 9848555198, ధర్మవరం : 9676540905, పుట్టపర్తి : 9160730935. [A-784529]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సింగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విరబూసిన మామిడి

- చిగురిస్తున్న రైతుల ఆశలు
- జిల్లాలో 20 వేల హెక్టార్లలో మామిడి సాగు
- పూత నిలబడేందుకు జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న ఉద్యాన అధికారులు



మామిడి చెట్టుకు విరబూసిన పూత

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో మామిడి పూత విరగబూసింది. వర్షాభావ పరిస్థితుల్లోనూ రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవడంతో పూత విరగబూయడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలోని 32 మండలాల పరిధిలో దాదాపు 20 వేల హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. సాధారణంగా డిసెంబర్ నాటికే పూత రావాల్సి ఉండగా ఈ ఏడాది కాస్త ఆలస్యమైంది. విరగబూసిన పూత నిలబడడానికి సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఎకరాలకు 5 నుంచి 6 టన్నుల దిగుబడి ఉంటుందని రైతులకు ఉద్యానాధికారులు సూచిస్తున్నారు.

బేనీషా తోటలే అధికం

మధుర ఫలంగా పిలుచుకునే మామిడిలో బేనీషా రకం పండుకు అత్యధిక ప్రాధాన్యత ఉంటోంది. జిల్లా వ్యాప్తంగా 20 వేల హెక్టార్లలో మామిడి సాగులో ఉండగా ఇందులో 95 శాతం తోటల్లో బేనీషా రకం మామిడినే రైతులు సాగు చేస్తున్నారు. బెంగళూరు, మల్లికా, ఖాదర్, మల్గూబ, నీలం తదితర రకాలు 5 శాతం ఉన్నాయి. గత ఏడాది వాతావరణ మార్పుల కారణంగా కొంత మేర దిగుబడి తగ్గినా గిట్టుబాటు ధరతో రైతులకు ఊరట దక్కింది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొని కొంత ఆలస్యంగా పూత వచ్చినా పూత విగరబూయడంతో మంచి దిగుబడి సాధించేందుకు రైతులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఉద్యాన శాఖాధికారులు సైతం విస్తృతంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, మామిడిలో పూత నిలబెట్టుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులను చైతన్య పరుస్తున్నారు. పూత విరగబూసిన తోటలు ఇప్పటికే వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. మామిడి చెట్ల వయసును బట్టి ధర నిర్ణయించి తోటలను సంరక్షిస్తున్నారు.

చేపట్టాల్సిన పనులు

మామిడి తోటల్లో జనవరి, ఫిబ్రవరి మాసాల్లో చేపట్టాల్సిన చర్యలపై డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం అధికారులు పలు సూచనలు చేసినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ముఖ్యంగా పిందె రాలకుండా ఉండేందుకు 4.5 లీటర్ల నీటికి 1 మిల్లీలీటరు ప్లానోఫిక్స్‌ను కలిపి పిచికారీ చేయాలి. అలాగే 100 లీటర్ల నీటిలో ఒక గ్రాము 2,4–డీ పొడిని కలిపి పిచికారీ చేయాలి. తామర పురుగు, తేనె మంచు పురుగు అధికంగా ఉన్నప్పుడు లీటరు నీటికి ఫిప్రోనిల్ 2 మి లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి నెలలో అకాల వర్షాల వల్ల వ్యాపించే తెగుళ్ల నివారణకు కాఫర్ ఆక్సీక్లోరైడ్ లేదా కాఫర్ హైడ్రాక్సైడ్ 3 గ్రాముల మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పోషకాలు తప్పనిసరి

చలి అధికంగా ఉన్న సమయంలో మామిడి పూత రావడం ఆలస్యమవుతుంది. తోటల్లో దున్నకం పూర్తయిన తర్వాత పోషకాలు పిచికారీ చేసి చెట్లలో పూమొగ్గలను ఉత్తేజపరచవచ్చు. లీటరు నీటికి పొటాషియం నైట్రేటు లేదా 13–0–45 ఎరువును 10 గ్రాములు, లీటరు నీటికి 10 గ్రాముల యూరియా సూక్ష్మ పోషకాల మిశ్రమం, పిచికారీ చేసుకోవాలి. మార్కెట్‌లో లభ్యమయ్యే ఫార్ములా–4, ఎఫ్–4, ఆగోమిన్ మ్యాక్స్ పోషకాలను లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. సూక్ష్మ పోషకాల వల్ల పూత బాగా వచ్చి ఎక్కువ పిందెలు రావడానికి ఉపయోగపడుతుంది.

జాగ్రత్తలు తీసుకోవాలి



మామిడి చెట్లలో పూతకు ముందు, పూత దశలో, పిందెల సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చు. కాయ దశలో అనేక రకాల తెగుళ్లు ఆశించి పంటకు తీవ్ర నష్టం కలిగిస్తాయి. సరైన సమయంలో నీటి తడులు, పోషకాలు అందించాలి. లేకపోతే పిందెలు రాలిపోతాయి.

– చంద్రశేఖర్, జిల్లా ఉద్యానాధికారి

పోషకాలు పిచికారీ చేస్తున్నాం



మామిడి తోటలో ఇప్పుడిప్పుడే పూత మొదలైంది. ఇప్పటికే తోటలో దున్నడం పూర్తయింది. పోషకాలతో పాటు మందులు పిచికారీ చేస్తున్నాం. అధికారుల సూచనల మేరకు తోటలను సంరక్షిస్తున్నాం. ఈ ఏడాది దిగుబడులు బాగా వస్తాయని ఆశిస్తున్నాం.

– జనార్ధన్, రైతు, జగరాజుపల్లి, పుట్టపర్తి మండలం

జనవాక్కు

మా కుమారుడికి పునర్జన్మనిచ్చారు



మాకు ఇద్దరు పిల్లలు సంతానం. చిన్నవాడైన గురువయ్య మూడు నెలల వయస్సులోనే అనారోగ్యం పాలయ్యాడు. చాలా ఆసుపత్రుల చుట్టూ తిరగాం. అయినా నయం కాలేదు. తలసేమియాతో బాధపడుతున్నట్లుగా డాక్టర్లు చెప్పారు. క్రమం తప్పని చికిత్సతో పాటు తరచూ రక్తమార్పిడి చేయిస్తుండాలని చెప్పారు. కూలి పనులతో జీవనం సాగించే మాకు పిల్లాడి చికిత్స తలకు మించిన భారమే అయింది. ఇదే సమయంలో తలసేమియా బాధితుల చికిత్స కోసం సీఎం వైఎస్ జగనన్న రూ.10 వేలు ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకుని మా కుమారుడికి పునర్జనిచ్చారు. ప్రస్తుతం తన తోటి పిల్లలతో కలసి మా కుమారుడు కూడా పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నాడు. సీఎం వైఎస్ జగనన్నకు కృతజ్ఞతలు.

– వెంకటప్రతాప్, శిరీషా దంపతులు, పుట్లూరు

మేలు మరువం



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టాక ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందా. వైఎస్సార్ చేయూత కింద ఏటా రూ.18,750, గృహ నిర్మాణం పథకం కింద జగనన్న కాలనీలో స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించారు. వైఎస్సార్ పెన్షన్ కానుక కింద వితంతు పింఛన్ వస్తుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు బాగున్నాయి. సీఎం జగన్ మేలును మరువం. మద్దతుగా నిలుస్తాం.

– నూర్జహాన్ బేగం, కూడేరు

పింఛన్ ఇచ్చి ఆదుకున్నారు



వ్యవసాయంతో జీవనం సాగిస్తున్న మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏడేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నా. గత టీడీపీ ప్రభుత్వంలో ఆర్థిక సాయం కోసం, పింఛన్ కోసం పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రాధేయపడినా ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో మా జీవితాలు బాగుపడ్డాయి. వలంటీర్ మా ఇంటి వద్దకే వచ్చి వివరాలు తీసుకెళ్లి నాకు పింఛన్ ఇచ్చేలా చేశారు. ఈ డబ్బుతో మెరుగైన వైద్య చికిత్సలు పొందుతున్నా. నా ప్రాణాలు కాపాడిన సీఎం వైఎస్ జగనన్నకు మా కుటుంబం ఎంతో రుణపడి ఉంటుంది.

– దేవన్న, కలుగోడు, గుమ్మఘట్ట మండలం

జగనన్నే మాకు పెద్ద దిక్కు



జగనన్న సీఎం అయిన తర్వాత మా కష్టాలన్నీ తీరాయి. మేము నలుగురమూ అక్కాచెల్లెళ్లమున్నాం. మా నాన్న అనారోగ్యంతో చనిపోయాడు. మాకు పెద్ద దిక్కు లేకుండా పోయింది. మమ్మల్ని చదివించేందుకు మా అమ్మ చాలా కష్ట పడింది. డ్రాపౌట్‌గా మారే తరుణంలో జగనన్న సీఎం అయ్యారు. అప్పుడే అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతో మేము ఉన్నత చదువులు అభ్యసించేందుకు మార్గం ఏర్పడింది. మా అమ్మకు వైఎస్సార్ చేయూత పథకం కింద ఏటా రూ.18,750 లబ్ధి చేకూరుతోంది. దీంతో కుటుంబంలోని ఆర్థిక ఇబ్బందులు దూరమవుతూ వచ్చాయి. మా అవ్వకు రూ.3వేల పింఛన్ అందుతోంది. కుటుంబ పెద్ద లేకపోయాడని దిగులు పడుతున్న సమయంలో ఇంటికి పెద్ద దిక్కుగా సీఎం వైఎస్ జగనన్న నిలబడడం మాకెంతో ఆనందంగా ఉంది.

– సుమలత, ఫణారం, గుడిబండ మండలం

ప్రమాదంలో యువకుడి మృతి



మృతుడు మహేష్

తాడిపత్రి: బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట గ్రామానికి చెందిన మహేష్ (22) చికెన్ సెంటర్లకు బాయిలర్ కోళ్లను సరఫరా చేసే బొలెరో వాహనాన డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తాడిపత్రికి కోళ్ల లోడుతో చేరుకున్న ఆయన.. సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యాడు. తాడిపత్రి మండలం వెంకటరెడ్డిపల్లి వద్దకు చేరుకోగానే బుగ్గ ప్రధాన రహదారిపై వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన మహేష్‌ను స్థానికులు తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడికి తల్లి రాధమ్మ ఉంది. తండ్రి లేడు.

భార్య ఖాతాలోకి ప్రభుత్వ సొమ్ము!

- వెలుగు చూసిన ఆర్అండ్‌బీ శాఖ ఉద్యోగి నిర్వాకం

అనంతపురం క్రైం: రోడ్లు భవనాల శాఖలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న నాగరాజు... తన భార్య ఖాతాలోకి ప్రభుత్వ సొమ్మును మళ్లించుకున్నాడు. ఫోర్జరీ సంతకాలతో ఏకంగా రూ.6 లక్షలను బదలాయించుకున్నట్లు ఆదివారం అనంతపురం రెండో పట్టణ పోలీసులకు ఆర్అండ్‌బీ ఈఈ ప్రసాదరెడ్డి ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శివరాముడు తెలిపారు.

క్లుప్తంగా

సర్పరూపుడికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పంచామృతాభిషేకాలు చేశారు. స్వామి విగ్రహాన్ని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం స్వామి వారి బంగారు కవచంతో మేళతాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణ హోమాలు చేశారు. అనంతరం మంజునాథ స్వామి, పార్వతీదేవికి పూజలు నిర్వహించి, మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

సంతల ఆదాయం రూ.4.09 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.4.09 లక్షల ఆదాయం వచ్చినట్లు యార్డు చైర్మన్ ఏ.ఫయాజ్, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2.34 లక్షలు వచ్చిందన్నారు. ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,75,230 మేర వసూలైనట్లు తెలిపారు.

బీజేపీ కిసాన్ మోర్చా కన్వీనర్‌గా గొర్ల సుధీర్‌రెడ్డి

రాప్తాడు: యర్రగుంట్లకు చెందిన గొర్ల సుధీర్‌రెడ్డిని బీజేపీ కిసాన్ మోర్చా రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కేశవ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం సత్యసాయి జిల్లాలోని కదిరి మండలంలో జరిగిన కిసాన్ మోర్చా జిల్లా సమావేశంలో గొర్ల సుధీర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శేఖర్, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఓబిలేస్, మచ్చా ఆదిశేషా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రాజేష్‌కు డాక్టరేట్ ప్రదానం



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని కామర్స్ విభాగంలో పరిశోధన చేసిన జి.రాజేష్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈయన ప్రొఫెసర్ హెచ్.లజిపతిరాయ్ పర్యవేక్షణలో 'అనంతపురం జిల్లాలోని పామిడిలో దర్జీ సంఘాలు, వ్యాపార విస్తరణ పద్ధతులు, వాటి పెంపుదల- విషయ పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

ముత్యాలమ్మకు పూజలు

రామగిరి: మండలంలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. ఉమ్మడి జిల్లా వాసులేగాక, కర్ణాటక నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. ముత్యాలమ్మకు కానుకలు సమర్పించారు. ఆలయంలో ప్రతి ఆది, మంగళ, శుక్రవా రాల్లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రాక

ఆత్మకూరు: మండల కేంద్రంలో వాల్మీకి విగ్రహ ప్రతిష్టకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోమవారం భూమిపూజ చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూజారి లక్ష్మీనరసింహులు తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రావాలని పిలుపునిచ్చారు.

నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రెండో స్థానం


రెండో స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్ జట్టు

అనంతపురం: నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు రెండో స్థానం దక్కించుకుంది. మహారాష్ట్ర రాష్ట్రంలోని గర్చిరోలి నగరంలో ఈ నెల 17న పోటీలు జరిగాయి. ఇందులో అనంతపురం జిల్లా చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. కృష్ణ (గుత్తి మండలం), అశోక్ (కనగానపల్లి మండలం), వెంకటేశ్ (రాప్తాడు మండలం), వెంకట్ (తాడిపత్రి మండలం), విజయ్‌కుమార్ , రియాజుద్దీన్, బాబా ఫక్రుద్దీన్, సందీప్ కుమార్, అనిల్ కుమార్, హరి , విష్ణు (అనంతపురం)ఆంధ్రప్రదేశ్ జట్టులో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్ , ఈశ్వరయ్య, కార్యదర్శి ఎస్.వెంకటేశులు తదితరులు క్రీడాకారులను అభినందించారు.

వైఎస్సార్‌సీపీతోనే మైనార్టీల సంక్షేమం

- నగరపాలక సంస్థ మేయర్ వసీం



మాట్లాడుతున్న మేయర్ వసీం, వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: టీడీపీ హయాంలో మైనార్టీల సంక్షేమానికి చేసిందేమీలేదని, కేవలం ఓటు బ్యాంకు కోసం వాడుకున్నారని మేయర్ వసీం అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మైనార్టీల సంక్షేమానికి కృషి చేసినట్లు తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడారు. ఇటీవల టీడీపీ నాయకులు మైనార్టీ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిపై చేసిన విమర్శలను మేయర్ ఖండించారు. ముస్లింమైనార్టీల కోసం నాడు వైఎస్సార్, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. మహానేత వైఎస్సార్ మైనార్టీల కోసం 4 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో మైనార్టీలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా గుర్తింపు తీసుకొచ్చారన్నారు. నగరంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నాయకత్వంలో మైనార్టీలకు 10 కార్పొరేషన్ స్థానాలు, మేయర్ పీఠం దక్కిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి తన హయాంలో నగర అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు.

మైనార్టీలను ఓడించింది మీరు కాదా?..

టీడీపీ హయాంలో మైనార్టీలకు ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తే, అప్పట్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి, మైనార్టీ అభ్యర్థి ఓటమికి కారకులు అయ్యింది మీరు కాదా? ప్రభాకరా? అని మేయర్ ప్రశ్నించారు. ఇదేనా మైనార్టీల పట్ల మీకున్న ప్రేమ అన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన మైనార్టీల ఆత్మీయ సమావేశానికి మైనార్టీ నాయకులే పాల్గొనలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మైనార్టీల సంక్షేమానికి రూ.25 వేల కోట్లు ఖర్చు చేశారని, టీడీపీ హయాంలో మైనార్టీల సంక్షేమానికి చేసిందేమీలేదన్నారు. సమావేశంలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్ , పార్టీ మైనార్టీ విభాగం జిల్లా కార్యదర్శి మహబూబ్‌బాషా, 37వ డివిజన్ సచివాలయ కన్వీనర్ షేక్ జావిద్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక బాషావలిషా దర్గా


కొడిమి బాషా వలి దర్గా

రాప్తాడురూరల్: మత సామరస్యానికి ప్రతీకగా అనంతపురం రూరల్ మండలం కొడిమి గ్రామ శివారులో బాషావలి షా దర్గా నిలుస్తోంది. ఈనెల 25 నుంచి గంధం ఉరుసు ప్రారంభం కానుంది. సుమారు 700 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ దర్గా మరుగున పడి ఎలాంటి అభివృద్ధికి నోచుకోని సమయంలో నంద్యాల జిల్లా బనగానపల్లెకు చెందిన హజరత్ సయ్యద్ అహ్మద్ బాదుషా ఖాద్రీ స్వామి ఆధ్వర్యంలో కొడిమి బాషావలి దర్గా అభివృద్ధి చెందింది. ప్రస్తుతం హజరత్ సయ్యద్ అహ్మద్ బాద్‌షా ఖాద్రీస్వామి కుమారుడు సద్గురు డాక్టర్ హజరత్ సయ్యద్ హుస్సేన్ బాద్ షా ఖాద్రి నేతృత్వంలో ఈ దర్గా దినదినాభివృద్ధి చెందుతోంది. రాయలసీమ నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు ఈ దర్గాను సందర్శించి, మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఏటా హిందూ, ముస్లింలు దర్గా గంధం ఉరుసు ఉత్సవాలను నిర్వహించుకోవడం ఆనవాయితీ. దర్గా సమాధిపై ఉన్న వేపచెట్టు ఆకు సర్వరోగ నివారిణిగా భక్తుల్లో విశ్వాసాన్ని నింపుతోంది. చరిత్ర ఉన్న ఈ దర్గాను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి , పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఇటీవల సందర్శించి, ఇక్కడికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వసతులు కల్పించడానికి, దర్గా అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు.

25న ఉరుసు ఉత్సవం..

ఈ నెల 25న సాయంత్రం 5 గంటల నుండి గంధం- ఉరుసు ఉత్సవం ప్రారంభమవుతుందని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. దర్గా ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఉరుసు ఉత్సవాల్లో పలు ఆధ్యాత్మిక సందేశాలు, ఫకీర్ల జల్సాలు, అన్నదాన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

కిడ్నీ బాధితుడికి 'అమ్మ' ఔదార్యం


కిడ్నీ బాధితుడికి నగదు అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: నగరంలోని కిడ్నీ బాధితుడికి అమ్మ సంస్థ అండగా నిలిచింది. వివరాలు.. జిల్లా కేంద్రంలోని పాతూరు సున్నంగేరికి చెందిన తిప్పేస్వామి ఓ హోటల్లో వంటమనిషిగా పనిచేస్తూ అరకొర వేతనంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. అతనికి భార్య గొల్లక్క, డిగ్రీ చదువుతున్న కొడుకు రుద్రేష్ ఉన్నారు. ఇటీవల రుద్రేష్‌కు జ్వరం వస్తోందని ఆస్పత్రికి వెళ్లగా రెండు కిడ్నీలూ పాడయ్యాయని, వెంటనే చికిత్స చేయించుకోవాలని వైద్యానికి రూ. 13 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. పేద కుటుంబం కావడంతో రూ.లక్షలు వైద్యఖర్చులు భరించే స్థోమతలేదు. తెలిసినవారిని, బంధువులను సాయం అడిగారు. సాయం చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఆపన్న హస్తం కోసం 'అమ్మ' సంస్థ తరిమెల రమణారెడ్డిని అర్థించారు. వెంటనే ఆయన మానవత్వంతో స్పందించారు. బాధితుడికి ఆదివారం రూ.4.50లక్షలు ఆర్థికసాయం అందించారు. అమ్మ సంస్థ ద్వారా సగం మొత్తాన్ని అందిస్తున్నామని, మిగిలిన సగం మొత్తం ఇతర స్వచ్ఛంద సంస్థలను సంప్రదించి రుద్రేష్‌ను ఆదుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

పీఆర్సీ సత్వరమే అమలు చేయాలి

రాప్తాడు: 12వ పీఆర్సీని సత్వరమే అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన జిల్లా సబ్ కమిటీ సంయుక్త సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, సిరాజుద్దీన్, జిల్లా ఓగడవ సలహాదారు వెంకటేశులు, అసోసియేట్ ప్రధాన కార్యదర్శి హనుమప్ప, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, సుభద్ర, మోహన్‌రెడ్డి, బొమ్మయ్య, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోమవారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి తెలిపారు. సాయంత్రం 3 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు, దళిత సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

24న మండల సర్వసభ్య సమావేశం

చెన్నేకొత్తపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 24న మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీఓ గంగావతి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు సర్పంచులు, జెడ్పీటీసీ సభ్యులు, అన్నిశాఖల మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

రేపు జాతీయ గీతాలాపన

తాడిపత్రి అర్బన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలో జాతీయ గీతాలాపన చేయనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అశోక్‌పిల్లర్, గాంధీసర్కిల్, యల్లనూరు రోడ్డు సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద లౌడ్ స్పీకర్ల ద్వారా జాతీయ గీతాన్ని ఆలపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పట్టణ ప్రజలను కోరారు.

ఘనంగా కలశ స్థాపన పూజలు


అంకాలమ్మ, కుంటెమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి: స్థానిక అంకాలమ్మ, కుంటెమ్మ ఆలయంలో ఆదివారం కలశస్థాపన పూజలు ఘనంగా నిర్వహించారు. ఈనెల 23, 24 తేదీల్లో ఆలయ 16వ జాతరను పురస్కరించుకుని పూజలు చేపట్టారు. ఈసందర్భంగా అంకాలమ్మ, కుంటెమ్మ దేవతామూర్తులను శోభాయానంగా అలంకరించి పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గణపతి, నవగ్రహ, లలిత సహస్ర నామ హోమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

మిల్లెట్ మేళాకు విశేష స్పందన


చిరుధాన్యాల విశిష్టతను తెలియజేస్తూ వేసిన ముగ్గును ఆసక్తిగా తిలకిస్తున్న దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక ఆర్ట్సుకళాశాల ఎదుట ఎగ్జిబిషన్ మైదానంలో ఆర్డీటీ, ఏఎఫ్ ఎకాలజీ, కార్డు, రెడ్స్ తదితర 16 ఎన్‌జీవోలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'మిల్లెట్ మేళా'కు విశేష స్పందన లభిస్తోంది. నగరవాసులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రదర్శన శాలలు, చిరుధాన్యాలతో తయారు చేసిన చిరుతిళ్లు, ఆహారోత్పత్తులను రుచి చూశారు. నగరవాసులతో పాటు ఎన్‌జీవోల తరఫున జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, మహిళలు తరలివచ్చారు. దీంతో రెండో రోజు ఆదివారం మేళా ప్రాంగణం కిటకిటలాడింది. కళాకారులు ప్రదర్శించిన కోలాటం, చెక్కభజనలు ఆకట్టుకున్నాయి. 'మన పంటలు-మన వంటలు' అంటూ చిరుధాన్యాల విశిష్టతను తెలియజేస్తూ వేసిన రంగవల్లులను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ప్రదర్శనశాలలో చిరుధాన్యాల సాగు, వినియోగం, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు తదితర విషయాలపై పెద్ద ఎత్తున పుస్తకాలు, రాగులు, కొర్రలు, జొన్నలు, అండుకొర్రలు, ఊదలు లాంటి సంప్రదాయ చిరుధాన్యాల ద్వారా తయారు చేసిన స్నాక్స్, మిఠాయిలు, రాగిముద్ద, జొన్న రొట్టె ఇతరత్రా వంటకాల అమ్మకాలకు మంచి స్పందన లభించినట్లు ఎన్‌జీవోలు తెలిపారు. మూడో రోజు సోమవారం మిల్లెట్ మేళా ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

మహావిప్లవ రూపశిల్పి లెనిన్


లెనిన్స్ వర్ధంతి సందర్భంగా విప్లవ వందనాలు సమర్పిస్తున్న ఎస్‌యూసీఐ నాయకులు, కార్యకర్తలు

అనంతపురం అర్బన్: సోషలిస్టు వ్యవస్థను ఏర్పాటు చేసిన మహావిప్లవ రూపశిల్పి లెనిన్ అని ఎస్‌యూసీఐ నాయకులు కొనియాడారు.ఆదివారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయం సమీపంలో ఎస్‌యూసీఐ పార్టీ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు హాజరై లెనిన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలో కార్మిక వర్గ రాజ్యం ఏర్పాటుకు కంకణబద్ధులు కావడం ద్వారా లెనిన్‌కు నిజమైన నివాళులు ఇవ్వగలమన్నారు. లెనిన్‌ను స్ఫూర్తిగా తీసుకుని పెట్టుబడిదారీ వ్యతిరేక సోషలిస్టు విప్లవాన్ని పరిపూర్తి చేయడానికి కార్మికవర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తబ్రేజ్, నాగముత్యాలు, నాగరాజు, నరేంద్ర, మహేష్, సురేష్, చరణ్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.


లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

మహా విప్లవనేత లెనిన్

అనంతపురం అర్బన్: లెనిన్ మహా విప్లవనేత అని సీపీఎం నాయకులు కొనియాడారు. ఆదివారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లప్ప మాట్లాడారు. మార్క్సిజాన్ని సిద్ధాంతం నుంచి ఆచరణకు, సైన్స్ నుంచి కళకు అభివృద్ధి చేయడం ద్వారా లెనిన్ ఆ రెండింటి మధ్య ఉన్న గతితార్కిక సంబంధం ఏమిటనేదాన్ని చూపించాడన్నారు. రాష్యాలో అక్టోబరు విప్లవం జయప్రదం చేయడంలో లెనిన్ అనుసరించిన వ్యూహాలు, ఎత్తుగడలను పరిశీలిస్తే, ఈ విషయం స్పష్టమవుతోందన్నారు. ఆయన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలరంగయ్య, నాగేంద్రకుమార్, నాగమణి, వెంకటనారాయణ, ముస్కిన్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

వైద్య శిబిరానికి స్పందన

కూడేరు: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో అనంతపురానికి చెందిన శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతపురంలోని పోలీస్ ట్రెనింగ్ సెంటర్ అడిషనల్ ఎస్పీ మల్లికార్జున వర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి వైద్య శిబిరం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సూత్రాలు పాటి స్తూ రోగాల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిపుణులైన వైద్యులు పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కొందరిని శస్త్ర చికిత్సకు రెఫర్ చేశారు. రామకృష్ణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కృష్ణ శశి, వైద్య నిపుణులు వంశీకృష్ణ, శ్రీకృష్ణ శశి, కృష్ణకాంత్‌రెడ్డి, సతీష్, జాగృతి స్కూల్ ఫౌండర్స్ శిరీష, పురుషోత్తం పాల్గొన్నారు.

దశభుజ గణపతికి పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

ప్రతి ఒక్కరికీ శారీరక శ్రమ అవసరమే



5 కే వాక్ ప్రారంభిస్తున్న ఎస్పీ అన్బురాజన్, ఆర్డీటీ డైరెక్టర్లు మాంఛో ఫెర్రర్, విశాల ఫెర్రర్

అనంతపురం: సామాజిక సేవ చేయడం ఎంత అవసరమో, శారీరక శ్రమ కూడా అంతే అవసరమని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన 10 కే రన్, 5 కే వాక్, కమ్యూనిటీ వాక్‌ను ఎస్పీ ప్రారంభించారు. కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నగరపాలక సంస్థ కమిషనర్ వై. మేఘ స్వరూప్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ఆర్డీటీ మహిళా సాధికారిత డైరెక్టర్ విశాల ఫెర్రర్ , అల్ట్రారన్నర్ జువాన మాన్యుయెల్ వైరా పాల్గొన్నారు. ఆర్డీటీ చేస్తున్న సేవా కార్యక్రమాలకు మద్దతుగా అల్ట్రా మారథాన్ ఈవెంట్లు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలకు మద్దతు ఇవ్వాలని ఈసందర్భంగా ముఖ్యఅతిథులు పిలుపునిచ్చారు. సామాజిక సేవ చేయడం ఎంత అవసరమో, శారీరక శ్రమ కూడా అంతే అవసరం అని అవగాహన కల్పించారు.

భక్తిశ్రద్ధలతో పుత్ర ఏకాదశి పూజలు


రుక్మిణీ పాండురంగస్వామి దేవతామూర్తుల ప్రాకారోత్సవ దృశ్యం


శ్రీదేవి, భూదేవి సమేత స్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

పామిడి: స్థానిక తగ్గు దేవాలయం, చిన్న విఠోబ ఆలయంలో ఆదివారం పుత్ర ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తగ్గుదేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి విగ్రహాలు, రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో రుక్మిణీ పాండురంగస్వామి విగ్రహాలను శోభాయానంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం ఆయా ఆలయ భజనబృందాలు భజనల నడుమ దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలకు ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా ఆలయ ప్రాంగణాలు గోవింద, జై విఠల నామస్మరణతో మార్మోగాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా ఆదివార ఆరాధన


మాట్లాడుతున్న బ్రదర్ బాబావలి

పామిడి: స్థానిక సీఎస్ఐ చర్చిలో ప్రారంభ సంవత్సర మొదటి మాస 3వ ఆదివారం ఆరాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దైవసేవకుడు బాబావలి మాట్లాడుతు మానవులు నీతి, సమాధానం కలిగి ఉండడం వల్లే ఐక్యత పెంపొందుతుందన్నారు. నీతి, సమాధానాలు ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా ప్రాప్తిస్తాయన్నారు. క్రీస్తుతోనే నిత్య జీవం లభిస్తుందన్నారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు, వీరయ్య, జయరాజు, జకరయ్య, రత్నరాజు, అబ్రహాం, దేవదాసు, కరుణాకర్, ప్రసాద్, రజని, ప్రిస్కిల్లా, సుశీలమ్మ, రేచెల్, మహిమ, కీర్తిమణి, వాణి, వాత్సల్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు త్వరలో కృష్ణాజలాలు


కాలువ పనులను చేయిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాప్తాడు: మండలంలోని మూడు చెరువుకులకు హంద్రీనీవా కాలువ నుంచి త్వరలో కృష్ణా జలాలు చేరుతాయని మండల ఎన్నికల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ అన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం పాలవాయి, ఎం.చెర్లోపల్లి, మరూరు చెరువులకు నీటిని నింపేందుకు జేసీబీతో కనగానపల్లి మండలంలోని మారెమ్మ గుడి దగ్గర నూతన కాలువ పనులను చేయించారు. వారు మాట్లాడుతూ పాలవాయి, ఎం.చెర్లోపల్లి, మరూరు గ్రామా చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు నింపేందుకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సొంత నిధులు రూ.50 లక్షలు వెచ్చించారన్నారు. మరో 10 రోజుల్లో చెరువులకు కృష్ణా జలాలను నింపుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాలవాయి లక్ష్మీనారాయణ, రామచంద్రారెడ్డి, మాచిరెడ్డి చెన్నారెడ్డి, బుడగ నాగరాజు, బాద పల్లయ్య, వలంటీర్లు మురళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి వాసికి ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు

గుత్తి: పట్టణానికి చెందిన డాక్టర్ సీహెచ్‌బి. జాకోబ్‌కు యాంబిషన్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు-2024 వరించింది. హైదరాబాద్‌కు చెందిన యాంబిషన్ కెరీర్ కౌన్సిలర్స్ సంస్థ ఏటా తెలుగు రాష్ట్రాల్లో బోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం చేస్తోంది. ఈ ఏడాది తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు 650 మంది అవార్డుకు నామినేషన్లు పంపారు. రాయలసీమ నుంచి కర్నూలులోని బిట్స్ కాలేజీలో ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న జాకోబ్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు.

లారీ బోల్తా

బొమ్మనహాళ్: శ్రీరంగాపురం క్యాంపు- ఉప్పరహాళ్ క్రాస్ రహదారిలో ఆదివారం ఉదయం భారీ లారీ బోల్తా పడింది. ఎటువంటి ప్రాణ నష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కర్ణాటకలోని జిందాల్ ఫ్యాక్టరీ నుంచి హిందూపురానికి వెళ్తున్న లారీ మండలంలోని ఉప్పరహాళ్ క్రాస్ సమీపంలోకి తెల్లవారుజామున 4 గంటలకు రాగానే అదుపుతప్పి పక్కన ఉన్న మాగాణిలోకి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్ బబ్లుసింగ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఇదే సమయంలో ఒక విద్యుత్ స్తంభం కూలిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220719, 9912220732, 9912220724,
9010223702, 9010567770, 9010588846, 9912220727